జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761

శనివారం | 26-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 793 పేజీలు: 4 వెల : రూ.7

# రోడ్లు ఛిద్రం



* పరిమితికి మించి వాహనాల్లో ఇసుక రవాణా
* నిబంధనలు పాటించని వాహన యజమానులు
* గోతులుగా మారిన రహదారులు
* శ్రీకాకుళం జిల్లాలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా
* అధికార పార్టీ నాయకులు అండదండలు
* పట్టించుకోని రవాణా శాఖ
* కలెక్టర్ ఆగ్రహించినా మారని అధికారుల వైఖరి



శ్రీకాకుళం, సెప్టెంబర్ 25 (వార్త): జిల్లాలో ఇసుక మాఫియాకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఒకవైపు నదీ గర్భాలు నలిగిపోతుంటే.. మరోవైపు అధిక లోడుతో ఇసుకను తరలిస్తున్న లారీల వల్ల జిల్లాలోని ప్రధాన రహదారులను సర్వనాశనం అవుతున్నాయి. రవాణా శాఖ నిబంధనల ప్రకారం ఏ వాహనానికి ఎంత బరువు ఉండాలో స్పష్టమైన పరిమితులు ఉన్నప్పటికీ, ఆ నిబంధనలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో రవాణా శాఖ అధికారుల అలసత్వం, మాఫియాతో కుమ్మక్కు కారణంగా రోడ్లు ధ్వంసమవుతున్నాయి.

## నిబంధనలు కాగితాల్లో.. అతిక్రమణలు రోడ్డెక్కి!

రవాణా శాఖ నిబంధనల ప్రకారం ఒక్కో లారీకి టైర్ల సంఖ్యను బట్టి మోయాల్సిన బరువు (టన్నుల్లో) నిర్ణయించారు. కానీ జిల్లాలో తిరుగుతున్న ప్రతి లారీ నిబంధనలను బొందపెట్టి ఏకంగా 10 నుంచి 15 టన్నుల అదనపు భారంతో రహదారులపై పరుగులు తీస్తోంది. 10 టైర్ల లారీ: అధికారిక పరిమితి 20 టన్నులు కానీ.. తీసుకెళ్తున్నది 30 - 35 టన్నులు. 12 టైర్ల లారీ: అధికారిక పరిమితి 26 టన్నులు కాగా.. తీసుకెళు
_న్నది 35 - 45 టన్నులు. 14 టైర్ల లారీ: అధికారిక పరిమితి 31 టన్నులు కాగా.. తీసుకెళ్తున్నది 46-55 టన్నులు. 16 టైర్ల లారీ: అధికారిక పరిమితి 36 టన్నులు కాగా.. తీసుకెళ్తున్నది 46 - 51 టన్నులు. ఇంత భారీ స్థాయిలో ఓవర్ లోడింగ్ జరుగుతున్నా రవాణా శాఖ ఒక్క కేసు కూడా నమోదు చేసిన దాఖలాలు లేకపోవడం వెనుక పెద్ద ఎత్తున మామూళ్ల పర్వం నడుస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు మంత్లీలు అందుతున్నాయి. అందుకే మేము క్షేత్రస్థాయిలో తూ.తూ మంత్రంగా తనిఖీలు చేసి వదిలేస్తుంటామని ఆ శాఖలో కిందిస్థాయి అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. వాస్తవానికి రోడ్డుపై వచ్చే వాహనాల నెంబర్లు ముందుగానే ఆయా అధికారుల గ్రూపుల్లో తిరుగుతుంటాయని, గ్రూపులో కనిపించని నెంబర్ ఉన్న వాహనాన్ని ఆపి మాత్రమే తనిఖీ చేస్తారని తెలుస్తోంది.

## కలెక్టర్ గట్టిగా నిలదీసినా.. స్పందన శూన్యం!

ఇటీవల జరిగిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ రవాణా, ఇతర శాఖల అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిమితికి మించి బరువుతో వెళ్తున్న వాహనాలపై తక్షణమే కేసులు నమోదు చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారని సమాచారం. 'కొత్త రోడ్డు జంక్షన్' వద్ద జాతీయ రహదారి పూర్తిగా ధ్వంసమైపోవడానికి ఈ పరిమితికి మించిన రవాణాయే కారణమని ఆయన నేరుగా ప్రస్తావించారు. ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ, ప్రధాన రహదారులన్నీ చిద్రమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దూసి రోడ్డులో ఆయా గ్రామస్థులు ధర్నాలు, ఆందోళనలు కూడా చేశారు. వాహనాలను సైతం అడ్డుకున్నాయి. ఓవర్‌లోడింగ్‌ను అరికడితే తప్ప రోడ్లను కాపాడుకోలేమని స్పష్టం చేసినప్పటికీ, రవాణా శాఖ అధికారుల్లో మాత్రం చలనం రాకపోవడం గమనార్హం. ఏళ్ల తరబడి అలవాటు పడిన మంత్లీలు వీక్లీల నుంచి వారు ఇంకా బయటపడలేదు.

## రాత్రి వేళల్లో తవ్వకాలు.. నదీ గర్భాలు గుల్ల!

నాగావళి, వంశధార నదీ పరీవాహక ప్రాంతాల నుంచి అర్ధరాత్రి వేళల్లో అక్రమ ఇసుక తోడేస్తున్నారు. పొక్లెయినర్లు, జేసీబీలతో నదీ గర్భాలను విచక్షణా రహితంగా తవ్వేస్తూ, టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్ల ద్వారా సరిహద్దులు దాటిస్తున్నారు. అనుమతులు లేని ప్రాంతాల్లోనూ భారీ యంత్రాలతో నదీ గట్లను తవ్వేస్తుండటంతో, భవిష్యత్తులో వరదలు వస్తే ప్రవాహ దిశ మారి గ్రామాలు మునిగిపోయే ప్రమాదముందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. స్థానిక గ్రామాల ప్రజలు, ప్రజాసంఘాలు ఎంత నిరసన వ్యక్తం చేసినా, కలెక్టరేట్ వెనుక భాగం నుంచి రోజుకు 120కి పైగా ట్రాక్టర్ల ద్వారా తోడుకెళ్తున్నా, తాత్కాలిక తనిఖీలతో సరిపెడుతున్నారే తప్ప శాశ్వత చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

## చర్యలు కాగితాలకే పరిమితమా?

రెవెన్యూ, పోలీస్, గనుల శాఖ అధికారులు అక్కడక్కడా ఆకస్మిక దాడులు చేసి కొన్ని వాహనాలను సీజ్ చేస్తున్నామని చెబుతున్నా, అసలు సూత్రధారులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. పరిమితికి మించి ఇసుకను నింపి రోడ్లను సర్వనాశనం చేస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేసి, వాహన యజమానులతో పాటు అక్రమ ఇసుక మాఫియాపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తే తప్ప ఈ విధ్వంసానికి అడ్డుకట్ట పడేలా లేదు.

# అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం



* రైతులకు పంట నష్ట పరిహారం అందిస్తాం * పంట నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించండి * జాబితా సిద్ధం చేసి అందజేయాలి * రైతులకు శాస్త్రవేత్తలు సూచనలివ్వాలి * దెబ్బ తిన్న రహదారులను పునరుద్ధరించండి * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * ముంపునకు గురైన వరి పంటల పరిశీలన

సంతబొమ్మాళి, సెప్టెంబర్ 25 (వార్త): ఇటీవల తీవ్ర వాయుగుండం ప్రభావంతో తీర ప్రాంత గ్రామాల్లో ముంపునకు గురైన వరి పంటలకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన అన్నారు.సంతబొమ్మాళి మండలంలోని శ్రీచక్రపురం, బోరుభద్ర, గోదలాం, కొల్లిపాడు, లక్కివలస, మరువాడ, మేఘవరం, వడ్డివాడ, కాకరపల్లి, అంట్లవరం, నగిరిపేట, సంతబొమ్మాళి, రయ్యిపేట, వడ్డితాండ్ర, ఆకాశలక్కవరం తదితర గ్రామాల్లో ముంపునకు గురైన వరి పంట పొలాలను మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి పంట నష్టానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. వర్షాలు దగ్గు ముఖం పట్టిన తర్వాత గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పర్యటించి క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనాల జాబితా నివేదికను సిద్ధం చేస్తారన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుండి నష్ట పరిహారం అందించి న్యాయం చేస్తామని మంత్రి హామీనిచ్చారు. రైతులు నష్టపోకుండా ప్రతి ఒక్క అధికారి కట్టుదిట్టమైన పర్యవేక్షణతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం రైతుల పక్కన నిలబడి ఉంది. విపత్కర పరిస్థితులు, వర్షాల ప్రభావం పరిస్థితులు ఎదురైన అధికారులు క్షేత్రస్థాయిలో జాగ్రత్తలు తీసుకుని రైతులకు అండగా నిలవాలని మంత్రి పేర్కొన్నారు. ముంపునకు గురైన పంట పొలాలను గుర్తించి, పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో సమగ్రంగా అంచనా వేసి వివరాలను నమోదు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పంట నష్ట తీవ్రతను తగ్గించేందుకు శాస్త్రవేత్తలతో సంప్రదించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతులకు అందాల్సిన నష్టపరిహారం విషయంలో ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయ మరియు హార్టికల్చర్ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటల నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఎం.సున్నపల్లి నుంచి పాల్‌నాయుడుపేట వరకు దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖ ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా రహదారుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ముంపు ప్రాంతాల్లో పంట నష్టం, రహదారుల నష్టం తదితర వివరాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో నమోదు చేసి, అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, రోడ్లు, భవనాల శాఖ ఇంజినీరింగ్ అధికారులు రవికాంత్, జగన్నాథరాజు, హరినాథ్, తహసీల్దార్ హేమసుందర్‌రావు, ఎంపీడీఓ పార్వతీశం, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఎస్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నాగావళి నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం: నాగావళి నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పరీవాహక ప్రాంత ప్రజలను కోరారు. శుక్రవారం కునుకుపేట, కిల్లిపాలెం, కల్లేపల్లి, జాలారిపేట, పశుబంద, పెదగనగళ్లవానిపేట గ్రామాల్లో గల ముంపు ప్రాంతాలను ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి లతో ఆయన విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలను ఆదేశించారు. వరద పరిస్థితులపై జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉద్యానవనం, వరి పంటలు నష్టపోయిన వారికి నష్ట పరిహారం అందిస్తామన్నారు. ముంపు ప్రాంతాలలో ఆయన స్వయంగా పరిశీలించి నష్టపోయిన పంటలపై అంచనాలు వేసి ప్రతిపాదన పంపాలని కలెక్టర్ కు సూచించారు. అక్కడి రైతులతో మాట్లాడి అక్కడి పరిస్థితిని తెలుసుకున్నారు. పెద్ద గనగళ్లవానిపేట వద్ద సముద్ర తీర ప్రాంతం వద్ద నాగావళి, సముద్రం కలిసే ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ పరిస్థితిని జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు మంత్రికు వివరించారు. ఇప్పటి వరకు అక్కడ ముందస్తుగా తీసుకొన్న చర్యలను శాసనసభ్యులను అడిగి తెలుసుకున్నారు. నాగావళి వరద తీవ్రతను పరిశీలించి అక్కడ తీసుకోవలసిన చర్యలు పై మంత్రి వివరించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రావణ్ కుమార్, ప్రత్యేక అధికారి లవరాజు, తాసిల్దార్ గణపతిరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# తుఫాన్ నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే శిరీష

**- బాధితులకు నష్టపరిహారంపై అధికారులతో సమీక్ష**



**మందస, సెప్టెంబరు 25(వార్త):** తుఫాన్ అనంతరం మందస మండలంలోని పలు ప్రాంతాల్లో పలాస శాసనసభ్యులు గౌతు శిరీష అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో ఏర్పడిన నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధిత ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, వ్యవసాయ మరియు ఉద్యాన పంటలు, విద్యుత్ వ్యవస్థ, రహదారులు తదితర అంశాలకు సంబంధించిన నష్టాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇప్పటివరకు గుర్తించిన నష్టాలు, అధికారులు చేపట్టిన నష్టం అంచనా ప్రక్రియ, బాధితులకు అందాల్సిన నష్టపరిహారం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రతి గ్రామంలో జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో సమగ్రంగా నమోదు చేయాలని, అర్హులైన ఏ ఒక్క బాధిత కుటుంబం కూడా నష్టపరిహారం పొందకుండా మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. నష్టం అంచనాల్లో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని బాధితుల వివరాలను ప్రభుత్వానికి త్వరితగతిన నివేదించాలని తెలిపారు. తుఫాన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అవసరమైన సహాయక చర్యలను వేగవంతం చేయాలని, దెబ్బతిన్న మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, రహదారి సౌకర్యాలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ప్రాంతాల్లో తుఫాన్ కారణంగా ఎదురైన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే, సాధ్యమైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. తుఫాన్ బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం, నష్టపరిహారం విషయంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని, నష్టపోయిన ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష స్పష్టం చేశారు. పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పొందరవీధిలో రూ.47వేలు పలికిన లడ్డు



**మందస, సెప్టెంబరు 25(వార్త):** మందసలోని పొందరవీధిలో వినాయకుని లడ్డూ వేలం పాట శుక్రవారం జరిగింది. కనకదుర్గ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వేం పాటలో పొందర ఈశ్వరబెహరా, జయంతి, ఉమాశంకర్, పొందర హేమలత కుటుంబం రూ.47016లకు లడ్డును దక్కించుకున్నారు. కనకదుర్గ కమిటీ సభ్యులు వారిని అభినందించి, లడ్డును వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరబెహరా మాట్లాడుతూ విఘ్నేశ్వరుని లడ్డు దక్కించుకోవడం ఆనందంగా ఉందన్నారు. భక్తులకు ప్రసాదంగా అందజేస్తానన్నారు.

## తుపానుతో పలు చోట్ల గండ్లు, నీట మునిగిన వరి



**మందస, సెప్టెంబరు 25(వార్త):** అర్నాబ్ తుపాను నష్టం మిగిల్చింది. సాగునీటి వనరులకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. అదేవిధంగా కొన్ని గ్రామాల్లో వరి పంటలు నీట మునిగాయి. దీంతో రైతులకు నష్టం జరిగింది. దీంతో పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీషమ్మ ఆదేశాల మేరకు జలవనరుల శాఖ ఏఈ ఎస్.వి.శ్రీనివాస రావు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. సునాముది గెడ్డ, మందస పట్టణంలోని దేశభట్టి ఛానల్ లింకు చెరువులు, ఈత ట్యాంక్, కోవెల ట్యాంక్, ఉమాగిరి ఉమ్మనా ట్యాంక్, ఉమాగిరి, భైరిసారంగపురం మధ్య దేశబట్టి ఛానల్ గండ్లు పడ్డాయని గుర్తించారు. చాకిరేవుగెడ్డ దగ్గర కొంత పొలం, హైవేకు ఆనుకుని ఉన్న సంకుజోడు ఛానల్ దగ్గర కొంత పంట పొలం నీట మునిగింది. ఆయా ప్రాంతాలలో ఏఈ శ్రీనివాసరావు పరిశీలించి, ఎంఎల్ఏ గౌతు శిరీషా పరిస్థితి వివరించారు. ఆయనతో పాటు సునాముది సిస్టం-1 ఛైర్మన్ రట్టి లింగరాజు కూడా ఉన్నారు.

## మరో రెండేళ్లు ఓపికతో పని చేయండి

**-బారువ నేతలతో వైయస్ జగన్**



**సోంపేట, సెప్టెంబరు 25 (వార్త):** ఎన్ని అవాంతరాలు, ఇబ్బందులు అధికార పార్టీతో వచ్చినా కాస్త ఓపికగా మరో రెండేళ్లు మన పార్టీ కోసం కష్టపడండని, తర్వాత మనదే ప్రభుత్వం అని వైసిపి అధినేత వైయస్ జగన్ ఇచ్చాపురం ఇన్చార్జ్ శ్యాంప్రసాద్ రెడ్డితో కలిసి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిసిన బారువ వైసీపీ నేతలకు భరోసా ఇచ్చారు. ఈ మేరకు సదరు నాయకులు గుర్రాల శ్రీనివాస్,రాజేష్ ఖన్నా, బుజ్జి, ధర్మారావు అలాగే ఇచ్చాపురం, కంచిలి మండలాలకు చెందిన మరో ఐదుగురు నేతలతో వైయస్ జగన్ మాట్లాడారు. దపదపాలుగా ముఖ్య నాయకులు, కార్యకర్తలను వైయస్ జగన్‌ను కల్పించే కార్యక్రమంలో భాగంగా మొదటిసారి శ్యాం ప్రసాద్ రెడ్డి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జగన్ను కలిసిన వారంతా చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

## మిత్రుని గుండె శస్త్రచికిత్సకు పూర్వ విద్యార్థుల ఆర్థిక చేయూత



**కొత్తూరు, సెప్టెంబరు 25(వార్త):** ఆపదలో ఉన్న తోటి మిత్రుడిని ఆదుకునేందుకు పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి తమ గొప్ప మనసును, స్నేహబంధాన్ని చాటుకున్నారు. కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1989-1990లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తమ సహాధ్యాయి తాలాడ గ్రామానికి చెందిన ఎగాటి లక్ష్మీనారాయణకు రూ.60,000 ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. మిత్రుల సకాల స్పందనతో లక్ష్మీనారాయణకు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని వైద్యులు, కుటుంబ సభ్యులు తెలిపారు. పూర్వ విద్యార్థుల ఔదార్యంపై బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు, తాలాడ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఘనంగా పండిట్ దీన దయాల్ జయంతి

**సోంపేట, సెప్టెంబరు 25 (వార్త):** బిజెపి సిద్ధాంతకర్త, పార్టీ మార్గదర్శకులు పండిట్ దీన దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు సోంపేటలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, బీన పవన్‌కుమార్, తెంబూరు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.





## డిమిరియాను భయపెడుతున్న వరద ఉధృతి

**- ఎగువ ప్రాంతాల నుంచి పోటెత్తున్న వర్షపు నీరు**

**-భయపడుతున్న గ్రామ ప్రజలు**

**-అధికారులు చర్యలు తీసుకోవాలి**

**-జనసేన మండల అధ్యక్షుడు గోపాలరావు**

**మందస, సెప్టెంబరు 25(వార్త):** డిమిరియా గ్రామాన్ని వరద నీరు భయపెడుతోంది. జిల్లుండ పంచాయతీలో గల ఈ గ్రామం మందస మండల కేంద్రానికి సుమారు 2కిలోమీటర్ల దూరంలో ఉంది. మందస నుండి జన్నచెరువు ఆయకట్టు మీదుగా ఈ గ్రామానికి ఉన్న ఒకే ఒక రోడ్డు ఉంది. రహదారి మార్గంలో సునాముదిగెడ్డ దాటి డిమిరియా గ్రామానికి వెళ్లాల్సి ఉంది. 40సంవత్సరాల క్రిందట మాజీమంత్రి గౌతు శ్యాంసుందరశివాజీ మొదటిసారి ఎంఎల్ఏగా గెలిచిన తరువాత ఆ గ్రామంతో ఉన్న అనుబంధంతో సుమారు 2లక్షల వ్యయంతో బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి గత సంవత్సరం ఇదే సమయంలో అప్పటి తుఫాన్ వరద నీరుకు బ్రిడ్జి మధ్యలోకి విరిగింది. స్థానిక ఎంఎల్ఏ గౌతు శిరీష దృష్టికి తీసుకొని వెళ్లిన వెంటనే ఆమె స్పందించి ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి, బ్రిడ్జి నిర్మాణానికి, రోడ్డు నిర్మాణానికి కలిపి నిధులను మంజూరు చేయించారు. గ్రామానికి ఎటువంటి రాకపోకల ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారులతో తాత్కాలిక ఏర్పాట్లు చేయించారు. కొత్త బ్రిడ్జి, రోడ్డు నిర్మాణానికి కావలిసిన నిధులు మంజూరు చేసినప్పటికీ, టెండరింగ్ ప్రాసెస్ దగ్గర ఆలస్యం అవ్వటంతో మళ్ళీ తుఫాన్ రావడంతో వరద నీరుతో బ్రిడ్జి ఎక్కడ కూలిపోతుందోనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి రవాణా సదుపాయం నిలిచిపోతుందని గ్రామ ప్రజలు ఆవేదన వక్తం చేస్తున్నారు. కొత్త బ్రిడ్జి వర్క్ ఎప్పుడు స్టార్ట్ అవుతుందోనని ఎదురు చూస్తున్నారు. తొందరగా స్థానిక ఎంఎల్ఏ మరో మారు దృష్టి పెట్టి బ్రిడ్జి, పాడైన బీటీ రోడ్డు వర్క్ప ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అదే గ్రామానికి చెందిన జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు, అదే గ్రామానికి చెందిన టీడీపీ క్లస్టర్ ఇన్ చార్జి ముంజేటి చంద్రశేఖర్, గ్రామ పెద్దలు పల్లి చంద్రయ్య, బెస్త వెంకటరావు కోరారు.

## మందసలో క్షేత్రస్థాయిలో వలస వివరాల సర్వే



**మందస, సెప్టెంబరు 25(వార్త):** జాతీయ గణాంక శాఖాధికారులు మందస మండలంలోని పర్యటించారు. జాతీయ గణాంక కార్యాలయం(ఎన్ఎస్ఓ) అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వలస వివరాల సర్వే(మైగ్రేషన్ పర్టిక్యులర్స్ సర్వే) చేపట్టారు. జాతీయ గణాంక కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ జనరల్, కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ గణాంక కార్యాలయం, విజయవాడ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ జనరల్, సీనియర్ ఐ.ఎస్.ఎస్.అధికారి శ్రీ డి.సతీష్ మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి గ్రామంలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వలస వివరాల సర్వే క్షేత్రస్థాయి పరిశీలనకై ఆయన ఈ సందర్శన చేశారు.

గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న సర్వే ఎన్యుమరేటర్ పనితీరును డి.డి.జి. డి.సతీష్ స్వయంగా పరిశీలించారు. సర్వే, డేటా సేకరణ విధానాన్ని తనిఖీ చేసిన ఆయన, సర్వేలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కె.రామకృష్ణ గ్రామస్తులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డి.డి.జి. సతీష్ మాట్లాడుతూ, దేశాభివృద్ధికి, విధానాల రూపకల్పనకు ఖచ్చితమైన గణాంకాలు చాలా కీలకమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ 'వలస వివరాల సర్వే ద్వారా దేశంలో ప్రజల వలసలకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారం సేకరించడం జరుగుతుందని, ఇది దేశంలోని నిరుద్యోగం, పేదరికం, ప్రాంతీయ అసమానతలు వంటి సమస్యలను పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ సమాచారాన్ని ఉపయోగిస్తారని ఆయన పేర్కొన్నారు. సర్వేలో పాల్గొంటున్న అధికారులు, ఎన్యుమరేటర్లు నిబద్ధతతో పనిచేసి, ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జాతీయ గణాంక కార్యాలయం ఉప ప్రాంతీయ కార్యాలయం(విశాఖపట్టణం) సూపర్ వైజింగ్ అధికారి, సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ సి.హెచ్.కృష్ణ, సర్వే ఎన్యుమరేటర్లు కె.సూర్యమహేష్, ఎం.కిరణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కె.రామకృష్ణ, మండల స్టాటిస్టికల్ ఆఫీసర్ ఎస్.రమ్య పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

**- ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, సెప్టెంబరు 25 (వార్త):** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతోపాటు ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలకమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వరల్డ్ ఫార్మసిస్ట్ డే సందర్భంగా పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో ఫార్మసిస్టులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు సూచించిన మందులను రోగులకు సక్రమంగా అందించడంతోపాటు వాటి మోతాదు, వినియోగ విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టులు కీలక బాధ్యత నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఔషధాల వినియోగంపై సరైన సూచనలు అందిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సేవలందిస్తున్నారని అన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఫార్మసీ రంగం అందించిన సేవలు మరువలేనివని అన్నారు. వ్యాక్సిన్లు, ఔషధాల తయారీ, సరఫరాతోపాటు అత్యవసర మందులు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఫార్మసీ రంగానికి చెందిన వారు విశేష కృషి చేశారని తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ బాధ్యతాయుతంగా ఔషధ సేవలు అందించిన ఫార్మసిస్టుల సేవలను అభినందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజారోగ్య కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు సమర్థంగా చేరేలా ఫార్మసిస్టులు మరింత చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. మందుల సరైన వినియోగం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడంతోపాటు ప్రభుత్వ వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో తమవంతు పాత్ర పోషించాలని కోరారు. వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందితోపాటు ఫార్మసిస్టులు కూడా ఆరోగ్య వ్యవస్థలో కీలక భాగస్వాములని కోరారు . ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో అంకితభావంతో సేవలందిస్తున్న ఫార్మసిస్టుల సేవలను సమాజం గుర్తించాలని అన్నారు. భవిష్యత్తులోనూ నాణ్యమైన ఔషధ సేవలు అందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఫార్మసిస్టులందరికీ వరల్డ్ ఫార్మసిస్ట్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనెల గోపాల్, జిల్లా అధ్యక్షుడు రేజేటి సుబ్రహ్మణ్యం, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ రమేష్, ఫార్మసీ ఆఫీసర్లు లీల, ఎ. స్వర్ణ, సతీష్, శైలజ, దీప, తులసి, ఎస్. స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.



## కాగువాడ గురుకులాన్ని ఎమ్మెల్యే మామిడి ఆకస్మిక తనిఖీ




**పాతపట్నం, సెప్టెంబరు 25(వార్త):** కాగువాడలోని మహాత్మా జ్యోతిబా పులే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలను విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, డార్మిటరీలు, వాష్‌రూమ్‌లు, పరిసరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. పాఠశాల గదుల పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యార్థినులు నిద్రించే డార్మిటరీలో స్లాబ్ కారుతున్న విషయాన్ని గమనించి వర్షపు నీరు లోపలికి రావడంతో విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. ఈ సమస్యను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు తీసుకునేలా మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత పట్ల ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు.

## ఘనంగా లక్కీ షాపింగ్ మాల్ ఎండీ గ్రంధి సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు




**పలాస, సెప్టెంబరు 25 (వార్త):** శ్రమను నమ్ముకుని అంచెలంచెలుగా ఎదిగిన లక్కీ షాపింగ్ మాల్ మేనేజింగ్ డైరెక్టర్ గ్రంధి సుబ్రహ్మణ్యం (స్వామి సార్) జన్మదిన వేడుకలను పలాసలోని లక్కీ షాపింగ్ మాల్‌లో సిబ్బంది ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ వేడుకల్లో మాల్ సిబ్బంది, మేనేజర్లు, సూపర్వైజర్లు ఉత్సాహంగా పాల్గొని తమ అధినేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్వయంగా యజమాని అయినప్పటికీ సిబ్బందితో కలిసి పనిచేస్తూ, సంస్థ అభివృద్ధిలో శ్రమకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్న గ్రంధి సుబ్రహ్మణ్యం స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని సిబ్బంది తెలిపారు. నిరంతర శ్రమ, క్రమశిక్షణ, అంకిత భావంతో వ్యాపార రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారని తెలిపారు. జన్మదిన వేడుకల సందర్భంగా సిబ్బంది సమక్షంలో గ్రంధి సుబ్రహ్మణ్యం కేక్ కట్ చేశారు. అనంతరం మేనేజర్లు, సూపర్వైజర్లు, ఇతర సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండిన జీవితం గడపాలని ఆకాంక్షించారు. సాధారణంగా యాజమాన్యం సిబ్బంది మధ్య ఉండే దూరానికి భిన్నంగా, ఉద్యోగులతో కలిసిమెలిసి పనిచేస్తూ సంస్థను ముందుకు తీసుకెళ్లడం తమ అధినేత ప్రత్యేకతగా సిబ్బంది అభిప్రాయపడ్డారు. నిరాడంబరత, సేవాభావంతో ఆయన కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు స్వామి యాదవ్, సాయిగణేష్‌తో పాటు సూపర్వైజర్లు, లక్కీ షాపింగ్ మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామయ్యవలస పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ



**జలుమూరు, సెప్టెంబరు 25 (వార్త):** రామయ్యవలసలోని ప్రభుత్వ పాఠశాలను ఎంఈఓ బమ్మిడి మాధవరావు శుక్రవారం పరిశీలించారు. గురువారం కురిసిన భారీ వర్షానికి పాఠశాల ఆవరణలోకి నీరు చేరి పాఠశాల మునిగిపోయిన విషయం తెలుసుకున్న ఆయన స్పందించి పాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించిన ఎంఈఓ నీటి నిల్వకు గల కారణాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. పాఠశాలలోకి నీరు చేరిన విషయంపై గురువారమే సమాచారం అందిందని, వెంటనే స్పందించి నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టామని ఎంఈఓ తెలిపారు. ప్రస్తుతం పాఠశాల పరిసరాల్లో పరిస్థితి సాధారణంగా ఉందని, శుక్రవారం పాఠశాల యథావిధిగా కొనసాగుతోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో వర్షపు నీరు నిల్వ కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

## ఘనంగా గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర



**పలాస, సెప్టెంబరు 25 (వార్త):** బంబూఫ్లాట్ ప్రాంతంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక వాతావరణం నడుమ ఘనంగా ముగిశాయి. మెడికల్ పహాడ్, నరసయ్య పహాడ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక స్వామివారి మండపాల్లో ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకున్నారు.

## జగన్‌ను కలిసిన మామిడి శ్రీకాంత్



**ఎల్ఎన్‌పేట, సెప్టెంబర్ 25(వార్త):** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లాలో పార్టీ పరిస్థితులు, పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై వైయస్ జగన్మోహన్ రెడ్డితో చర్చించారు.

## కూలిన మత్స్యకారుల ఇళ్లు



**సోంపేట, సెప్టెంబర్ 25 (వార్త):** ఇసుకల పాలెం గ్రామంలో భారీ వర్షాలు, గాలులకు మత్స్యకారుల ఇల్లు నేలమట్టమయ్యాయి. గ్రామానికి చెందిన సాగూరు కామమ్మ ఇల్లు, వాసుపల్లి కేశవరావుకు చెందిన చేపల నిల్వ చేసే గోడౌన్ నేలమట్టమయ్యాయి. దీంతో బాధితులు లబోదిబో మంటున్నారు. పేదరికానికి తోడు ప్రకృతి ఆగ్రహానికి గురి కావడంతో ఏం చేయాలో తోచక ఎంతో ఆవేదన చెందు తున్నారు. ఇటువంటి కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదు కోవాలని గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు బైపల్లి రామారావు కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# వర్షాలతో పాఠశాల పాత భవనానికి ముప్పు

**-విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి**

**-శిథిలావస్థలోని తరగతి గదులపై దృష్టి సారించాలి**

**-ఎమ్మెల్యే శిరీష దృష్టికి సమస్యను తీసుకెళ్లిన**

**మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్**



**పలాస, సెప్టెంబరు 25 (వార్త):** భారీ వర్షాల నేపథ్యంలో పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలోని కాశీబుగ్గ మండల కార్యాలయం సమీపంలోని సాయి కాలనీ హైస్కూల్‌లో పాత భవనం పరిస్థితిని పురపాలక సంఘం సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ శుక్రవారం పరిశీలించారు. వర్షాలకు భవనం స్లాబ్ దెబ్బతిని పెచ్చులూడిపోవడంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో పాఠశాలకు వెళ్లి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాత భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని గుర్తించిన పాఠశాల ఉపాధ్యాయులు ముందస్తు జాగ్రత్తగా విద్యార్థులను సురక్షితమైన ఇతర గదులకు తరలించడం పట్ల శ్రీకాంత్ అభినందించారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పాఠశాల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వర్షాలు కొనసాగుతున్నందున భవన పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. పర్యటనలో భాగంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును కూడా శ్రీకాంత్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంట గది, వంట సామగ్రిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని వంట సిబ్బందికి సూచించారు. వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పాఠశాలలోని పాత భవనం, శిథిలావస్థకు చేరిన తరగతి గదుల పరిస్థితిని స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి దువ్వాడ శ్రీకాంత్ తీసుకెళ్లారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని భవన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని వివరించారు. సమస్య తీవ్రతను బట్టి తక్షణ చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పాఠశాల మౌలిక వసతులు మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానని శ్రీకాంత్ భరోసా ఇచ్చారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బందితో మాట్లాడి పాఠశాలలోని సమస్యలు, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భద్రతే ప్రథమ ప్రాధాన్యమని, శిథిలావస్థలో ఉన్న భవనాల విషయంలో ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని శ్రీకాంత్ అన్నారు.

## వసపలో ముంపునకు గురైన తంపర భూముల పరిశీలన



**కొత్తూరు, సెప్టెంబరు 25(వార్త):** వసప గ్రామంలో ముంపునకు గురైన తంపర భూములను కొత్తూరు తహసీల్దార్ వై. సరోజినీ అధికారుల బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరద ప్రవాహం కారణంగా నీటమునిగిన పంట పొలాలను స్వయంగా పరిశీలించి, అక్కడి వాస్తవ పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా నీటమునిగిన భూముల విస్తీర్ణం, దెబ్బతిన్న పంటల వివరాలు, అలాగే రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక రైతులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ముంపునకు గురైన ప్రతి ఎకరా భూమి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా నమోదు చేయాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పూర్తి సమాచారాన్ని సేకరించి, ఎంత విస్తీర్ణంలో పంట నష్టం జరిగిందో సమగ్ర నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపనున్నట్లు స్పష్టం చేశారు. బాధితులకు తగిన న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తామని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కొత్తూరు ఎస్సై కె. వెంకటేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి (ఏఓ), వీఆర్వో, గ్రామ వ్యవసాయ సహాయకుడు (వీఏఏ), వీఆర్ఏలతో పాటు స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు గ్రామంలోని పలు ముంపు ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని నమోదు చేసుకున్నారు.

## లింగాకర్షణ బుట్టలపై మహిళా రైతులకు అవగాహన



**సారవకోట, సెప్టెంబరు 25 (వార్త):** తొగిరి గ్రామంలో మహిళా రైతులకు లింగాకర్షణ బుట్టల ఏర్పాటుపై శుక్రవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. పంటలను ఆశించే హానికర పురుగులను గుర్తించి, వాటి ఉద్ధృతిని ప్రారంభ దశలోనే నియంత్రించేందుకు లింగాకర్షణ బుట్టలు ఉపయోగపడతాయని వివరించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రకాష్ మాట్లాడుతూ పంట పొలాల్లో పురుగుల ఉనికిని ఎప్పటికప్పుడు గమనించాలని రైతులకు సూచించారు. పంటలకు నష్టం కలిగించే పురుగులను నియంత్రించడంతో పాటు పంటలకు మేలు చేసే మిత్ర పురుగులను గుర్తించి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. రసాయన మందుల వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా అందుబాటులో ఉన్న పద్ధతులను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. పంటలకు హాని చేసే పురుగుల కుటుంబాన్ని నియంత్రించేందుకు తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని, పంట నాణ్యతతో పాటు దిగుబడిని కాపాడుకునేందుకు రైతులు అవగాహనతో వ్యవహరించాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా రైతులు పాల్గొన్నారు.

## వర్షాలకు కోతకు గురైన రోడ్డు



**సారవకోట, సెప్టెంబరు 25 (వార్త):** కేళవలస-పద్మాపురం గ్రామాల మధ్య ఇటీవల నిర్మించిన నూతన రహదారి వర్షాలకు కోతకు గురైంది. దీంతో రహదారి నిర్మాణ నాణ్యతపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోటబొమ్మాళి మండలం పాకివలస నుంచి సారవకోట మండలం అలుదు వరకు చేపడుతున్న రహదారి నిర్మాణంలో భాగంగా కేళవలస--పద్మాపురం మధ్య కొత్తగా రోడ్డు నిర్మించారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలు, తుపాను ప్రభావంతో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన బెర్మలు కొట్టుకుపోవడంతో రహ దారిలోని కొంత భాగం కోతకు గురైంది. రోడ్డుకు ఇరువైపులా వేసిన బెర్మలను పటిష్ఠంగా రోలింగ్ చేయక పోవడం వల్లే వర్షపు నీటి ఉద్ధృతికి అవి నిలవలేకపోయాయని స్థానికులు పేర్కొంటున్నారు. నిర్మాణ సమ యంలో నాణ్యతా ప్రమాణాలపై తగిన శ్రద్ధ తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తగా నిర్మించిన రహ దారి కొద్దికాలానికే దెబ్బతినడంతో సంబంధిత అధికారులు నిర్మాణ పనులను పరిశీలించి, రహదారి కోతకు గల కారణాలను గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. భవిష్యత్తులో వర్షాలకు రహదారి మరింత దెబ్బతిన కుండా బెర్మలను పటిష్ఠంగా ఏర్పాటు చేసి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బెల్లుపడలో 'ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం'

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 25 (వార్త):** రాష్ట్ర బీసీ రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ కొండ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో బెల్లుపాడలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం నిర్వహించారు. ఫార్మసీ ఆఫీసర్ తంకాలా రఘునాథరావు కి మరియు ప్రముఖ వైద్యాధికారులకు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ దేవేందర్ రెడ్డి (సి హెచ్ సూపరింటెండెంట్ ) డాక్టర్ అఖిల్ మనోహర్, ఫార్మసీ ఆఫీసర్ తంకాలా రఘునాథరావు లకు సన్మానించారు. ఈ వేడుకలో ఆసుపత్రి వైద్యులు ఆశవర్కర్స్, స్వర్ణ సచివాలయం స్టాఫ్, అంగనవాడి టీచర్స్, ఆర్పీలు, విద్యాసిబ్బంది, హెల్త్ స్టాఫ్, కస్తూరిబా టీచర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గుంతలో స్కూటీ పడి వ్యక్తి మృతి



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 25 (వార్త):** మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం చెక్‌పోస్ట్ సమీపంలో హైవేపై గుంతల కారణంగా స్కూటీపై ప్రయాణిస్తున్న పైల నరసింగో (26) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. సంపాదించే కొడుకు మృతి చెందడం మా కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. రాత్రి 11 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి హైవే పై ఉన్న గుంతలే కారణమని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలను సకాలంలో పూడ్చాల్సిన బాధ్యత ఎవరిదని రహదారి భద్రతను పర్యవేక్షిస్తున్న అధికారులు ఏం చేస్తున్నారని తమ కుమారుడి ప్రాణానికి బాధ్యత ఎవరు వహిస్తారు? అని ప్రశ్నించారు. మరో ప్రాణం పోకముందే ప్రమాదకరమైన గుంతలను వెంటనే పూడ్చి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సంఘటన జరిగిన ప్రదేశం ఒడిశా పరిధిలో కి వస్తుంది. వెంటనే గుంతలు పూడ్చాలని జనసేన నాయకులు దాసరి రాజు డిమాండ్ చేశారు.

## దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలే బీజేపీకి మార్గదర్శకం



**పలాస, సెప్టెంబరు 25 (వార్త):** ఏకాత్మ మానవతావాద సిద్ధాంత ప్రతిపాదకుడు, భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం శ్రీ బంజేశ్వరమ్మ ఆలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పాలవలస వైకుంఠరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశ అభివృద్ధికి స్వదేశీ ఆలోచనా విధానం, జాతీయ భావాలు, సమాజంలోని చివరి వ్యక్తి సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకున్న రాజకీయ సిద్ధాంతం అవసరమనే లక్ష్యంతో భారతీయ జనసంఘ్ ఆవిర్భవించిందన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తి నేటికీ బీజేపీకి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు. భారతీయ జనసంఘ్ నుంచి భారతీయ జనతా పార్టీగా పరిణామం చెందిన రాజకీయ ప్రస్థానం వెనుక దశాబ్దాలుగా కోట్లాది మంది నాయకులు, కార్యకర్తల త్యాగం, కృషి, అంకితభావం ఉన్నాయని తెలిపారు. దేశభక్తి, జాతీయత, ప్రజాసేవ, అంత్యోదయ లక్ష్యాలతో పార్టీ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. 'దేశమే ప్రధానం.. ప్రజాసేవే లక్ష్యం' అనే భావనతో భారతమాత సేవలో బీజేపీ కార్యకర్తలు పనిచేస్తున్నారని, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే అంత్యోదయ స్ఫూర్తికి నిజమైన నివాళి అని వైకుంఠరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీ బంజేశ్వరమ్మ ఆలయ ధర్మకర్త, సేవా సంకల్ప ఉత్సవ కమిటీ సభ్యుడు రామానంద స్వామి, టౌన్ ప్రధాన కార్యదర్శులు బొండా శ్రీనివాసరావు, హనుమంతు రామారావు, టౌన్ బీజేవైఎం అధ్యక్షుడు పొందర ఈశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వైశ్య రాజ్‌మోహన్‌రాజ్, బూర్జి కోటేశ్వరరావు, బుర్జపేట హరికృష్ణ, బుద్ధరెడ్డి శ్రీనివాసరావు, తిరునగరి గణేష్, తర్లాన అన్నారావు, కోళ్ల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

**-పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష**

**-30 వినతుల స్వీకరణ**



**పలాస, సెప్టెంబరు 25 (వార్త):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడమే లక్ష్యంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శుక్రవారం పలాసలోని పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా.. మొత్తం 30 వినతులను ఆమె స్వీకరించారు. పెన్షన్లు, గృహ నిర్మాణం, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రజలు అర్జీలు అందజేశారు. ప్రతి అర్జీదారుడితో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. అర్హతలు, ప్రభుత్వ నిబంధనలు, సంబంధిత శాఖల పరిధిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల నుంచి అందిన వినతులను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే సమస్యలపై ఆలస్యం చేయకుండా స్పందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అన్నారు. పెన్షన్లు, హౌసింగ్‌తో పాటు వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి అర్హులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేసేందుకు పార్టీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు ఎమ్మెల్యేను నేరుగా కలిసి సమస్యలు వివరించే అవకాశం లభించింది. 30 వినతులపై సంబంధిత శాఖల స్పందన, తదుపరి చర్యలపై ఇప్పుడు దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ప్రజా పోరాటాల్లో చంద్రమ్మ జీవితం స్ఫూర్తిదాయకం

**-బొడ్డపాడులో ఘనంగా**

**ఆరో వర్ధంతి వేడుకలు**

**పలాస, సెప్టెంబరు 25 (వార్త):** ప్రజా సమస్యలపై సాగిన పోరాటాల్లో పైలా చంద్రమ్మ జీవితం, ఆమె చేసిన త్యాగాలు స్మరణీయమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. పలాస మండలం బొడ్డపాడులో పైలా చంద్రమ్మ ఆరో వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ సంస్థల ప్రవేశం పెరగడం వల్ల రైతాంగం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని ప్రకాష్ తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు, భూములపై పెద్ద సంస్థల ఆధిపత్యం పెరుగుతోందని, దీనివల్ల చిన్న, సన్నకారు రైతులపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందని అన్నారు. తీర ప్రాంతాల్లో భూముల వినియోగం, పారిశ్రామిక ప్రాజెక్టులు, సహజ వనరులపై ప్రభుత్వ విధానాల ప్రభావంపై ప్రజల్లో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. భూమి, జీవనోపాధి, హక్కుల కోసం జరిగిన శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట చరిత్రలో పైలా చంద్రమ్మ వంటి మహిళల పాత్రను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ఉద్యమ కాలంలో ప్రజలు ఎదుర్కొన్న పరిస్థితులు, చేసిన త్యాగాలు, సాధించుకున్న హక్కులను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. సామాజిక, ఆర్థిక అసమానతలు కొనసాగుతున్నంత కాలం ప్రజా సమస్యలపై వివిధ రూపాల్లో ఉద్యమాలు కొనసాగుతాయని ఆయన అన్నారు. గిరిజన ప్రాంతాల్లో సహజ వనరుల వినియోగం, భూముల పరిరక్షణ, జీవనోపాధి వంటి అంశాలపై ఆదివాసీ ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు, యువత, మేధావులు కూడా ప్రజా సమస్యలపై తమ స్వరాన్ని వినిపిస్తున్నారని చెప్పారు. శ్రీకాకుళం ఉద్యమ చరిత్రలో మహిళల పాత్ర ప్రత్యేకమైనదని, సామాజిక ఆంక్షలను అధిగమించి పలువురు మహిళలు ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములయ్యారని ప్రకాష్ అన్నారు. చంద్రమ్మను స్మరించుకోవడం అంటే ఆమె జీవిత చరిత్రను గుర్తు చేసుకోవడంతో పాటు, నేటి సమాజంలో రైతులు, మహిళలు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడం కూడా కావాలని అన్నారు. ఈ సభలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గొరకల బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు మామిడి భీమారావు, కార్యదర్శి రాపాక మాధవరావు, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరమ్మ, కుసుమ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, ఉపాధ్యక్షుడు జుత్తు వీరాస్వామి, అఖిల భారత ఆదివాసీ వేదిక నాయకుడు సవర బంగ్లా కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## 937 హెక్టార్ల వరి పంట ముంపు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 25 (వార్త):** ఇటీవల కురిసిన వర్షాలు బహుదా నదిలో నీటి ప్రవాహం కారణంగా పలు గ్రామాల్లో వరి పొలాల్లో నీరు నిలిచినట్లు ప్రాథమికంగా గుర్తించబడిందని వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ చెప్పారు. గ్రామాల వారిగా అందిన నివేదికల ప్రకారం 15 గ్రామాలో సుమారు 2,314 ఎకరాల (937 హెక్టార్ల) వరి పంట ముంపునకు గురైనట్లు ప్రాథమికంగా నమోదైందని ప్రభావిత పంట ప్రస్తుతం ప్రధానంగా పిలకల దశ లో ఉందని, బహుదా నదిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టినట్లయితే పొలాల్లో నిలిచిన నీరు తగ్గి పంటను కాపాడుకునే అవకాశం ఉంని . రైతులు పొలాల్లో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించేందుకు చర్యలు చేపట్టాలని, అధిక తేమ కారణంగా తెగుళ్ల ఉధృతి పెరగకుండా సిబ్బంది సూచనల మేరకు హెక్సాకోనజోల్‌ను అవసరమైన విధంగా తక్షణమే వినియోగించుకోవాలని రైతులకు కోరారు.

## బాధిత రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**సోంపేట, సెప్టెంబరు 25 (వార్త):** ఆర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో సోంపేట మండలంలో సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లందని మాజీ ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వైసీపీ నేతలతో కలిసి శుక్రవారం పలు గ్రామాల్లో పంట ముంపు ప్రాంతాలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది చాలా ఆలస్యంగా వరినాట్లు వేయడం, వెంటనే తుఫానుకు భారీ వర్షాలు కురవడంతో జింకీభద్ర, బెంకిలి , పలాసపురం, లక్కవరం, బారువ,గొల్లగండి, ఋషికుద్ద, పొత్రకొండ తదితర గ్రామాల పరిధిలో నీట మునిగిన పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ కూడా వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బాధిత రైతాంగానికి నష్టపరిహారం అందేలా చూడాలని అన్నారు. లేనియెడల వైసీపీ తరపున పోరాటం తప్పదని పేర్కొన్నారు.

## తుఫాన్ ప్రాంతాల్లో విప్ అశోక్ పర్యటన



**ఇచ్ఛాపురం సెప్టెంబరు 25 (వార్త):** తుఫాన్ ప్రభావిత గ్రామాలైన డొంకూరు బూర్జపాడు గ్రామాలలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ పర్యటించారు. తుఫాన్ వల్ల జరిగిన నష్టాలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారికి పళ్ళు, బిస్కెట్లు, బన్ లు అందించారు. అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి,ప్రజలకు అవసరమైన సౌకర్యాలు అందించాలని ఆదేశించారు. పంటలు,రహదారులు, మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, ప్రభుత్వం తరఫున బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఈ పర్యటనలో స్పెషల్ ఆఫీసర్ వేణు గోపాల్ , డీఎస్పీ భవాని ,సీఐ, చిన్నం నాయుడు మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, లోకనాథ,సురేష్, నరేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంబకాయ జంక్షన్‌లో దోమల నివారణ చర్యలు



**నరసన్నపేట, సెప్టెంబరు 25 (వార్త):** కంబకాయ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు శుక్రవారం ఉదయం ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో డెంగీ జ్వరాలు నమోదవుతున్నాయంటూ వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈవో జగన్మోహన్‌రావు సిబ్బందితో కలిసి కంబకాయ జంక్షన్ పరిసరాలను పరిశీలించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. దోమల వృద్ధికి అనుకూలంగా ఉన్న నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి వాటిలో నివారణ మందు పిచికారి చేయనున్నట్లు తెలిపారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో దోమల వ్యాప్తి పెరగకుండా అవసరమైన ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలను మరింత విస్తరిస్తామని ఈవో పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని తెలిపారు. అధికారులు చేపట్టిన చర్యలతో దోమల బెడద తగ్గుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 25 (వార్త):** మండల ప్రజా పరిషత్ ఇచ్ఛాపురం ప్రత్యేక అధికారి గా చల్లా శ్రీనివాస్ రెడ్డి బాధ్యత లు స్వీకరించారు. ఎంపీడీఓ ప్రభాకర్ రావు, ఏఓ రామారావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు మరియు మండల ప్రజాపరిషత్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## హిరమండలం ప్రత్యేక అధికారిగా రాజగోపాల్ రావు

**హిరమండలం సెప్టెంబర్ 25(వార్త):** ఎంపీపీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగియడంతో మండల పరిషత్‌ల పరిపాలనా వ్యవహారాలను పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఏడీ బి.రాజగోపాల్ రావు హిరమండలం మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## దెబ్బ తిన్న ఇళ్ల పరిశీలన



**ఇచ్ఛాపురం సెప్టెంబరు 25 (వార్త):** బెల్లుపడలో తుఫాను ప్రభావం తో వర్షాల తీవ్రతకు పేద కుటుంబానికి చెందిన ఇల్లులు దెబ్బతిని కూలిపోయావి . విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర బీసీ రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ కొండ శంకర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి వెళ్లి దెబ్బతిన్న ఇంటిని స్వయంగా పరిశీలించి, నిరాశ్రయులైన బాధితులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వానికి ఉండటానికి నీడ లేక ఇబ్బంది పడుతున్న పేద కుటుంబానికి తక్షణమే అత్యవసర ఆర్థిక సాయం, నష్టపరిహారం అందించి, నూతనంగా 'పక్కా ఇల్లు' మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని జిల్లా అధికారులను కోరారు. పేదల సంక్షేమానికి కట్టుబడిన మన ప్రభుత్వం ఈ కుటుంబానికి ఖచ్చితంగా అండగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసి ధర్మరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కళింగ వైశ్యులను రాష్ట్రవ్యాప్తంగా బీసీ జాబితాలో చేర్చడం హర్షణీయం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 25 (వార్త):** కళింగ వైశ్యులను రాష్ట్రవ్యాప్తంగా బీసీ జాబితాలో చేరుస్తూ, బీసీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం పట్ల కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పూన సంతోష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఆయన కళింగ వైశ్య సమాజం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విజయం వెనుక అనేకమంది ప్రజాప్రతినిధుల కృషి ఉందన్న ఆయన.. "కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సమయంలో ఇచ్ఛాపురం శాసనసభ్యులు బెందాళం అశోక్ ని నియోజకవర్గంలోని కళింగ వైశ్య సంఘాలన్నీ కలిసి మా సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారని . అలాగే జిల్లా మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు , కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకురావడం జరిగిందని,వీరందరి పట్టుదల, కృషి, మరియు మంత్రి సవిత ప్రత్యేక సహకారంతోనే జరిగిన మేలును కళింగ వైశ్య జాతి ఎప్పటికీ మరువదు" అని సంతోష్ కుమార్ స్పష్టం చేశారు.



## రాజారాంపురంలో ఆరోగ్య భద్రతపై అవగాహన



**పోలాకి, సెప్టెంబరు 25 (వార్త):** తీర ప్రాంత గ్రామాల ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలాకి ప్రాథమిక ఆసుపత్రి ఆరోగ్య విస్తరణ అధికారి డాక్టర్ నల్లి రవికుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని తీర ప్రాంత గ్రామమైన రాజారాంపురంలో ప్రజలతో మాట్లాడి ఆరోగ్య భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తాగునీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే వినియోగించాలని సూచించారు. వీలైనంత వరకు నీటిని కాచి చల్లార్చిన తర్వాత తాగడం ద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలని, వేడి ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలని ప్రజలక సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆకుకూరలు, చేపలను తాత్కాలికంగా తీసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ రవికుమార్ తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా కాపాడుకోవాలని, తాగునీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు గ్రామంలోని తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ఆరోగ్యశాఖ సూచనలను పాటిస్తూ నీరు, ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

## ఎన్ఎస్ఎస్‌తో సామాజిక బాధ్యత

**నరసన్నపేట, సెప్టెంబరు 25 (వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రాధాన్యం, సమాజం పట్ల విద్యార్థుల బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.లత మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యతను గుర్తించి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. 'నాట్ మీ బట్ యూ' అనే ఎన్ఎస్ఎస్ నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇతరుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె కోరారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వాములై సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.దిలీప్‌కుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సామాజిక సేవ ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు.




# తుఫాన్ ముంపు పంటలకు పరిహారం అందించాలి

**- ముంపు ప్రాంతాల్లో సీపీఐ నాయకుల పర్యటన**

**- క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనా వేయాలని డిమాండ్**

**- బాధిత రైతులకు తక్షణం పరిహారం అందించాలని విజ్ఞప్తి**



**సారవకోట, సెప్టెంబరు 25 (వార్త):** తుపాను ప్రభావంతో ముంపునకు గురైన పంటలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి బాధిత రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ కోరారు. శుక్రవారం సారవకోట మండలంలోని ముంపు ప్రాంతాలను సీపీఐ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. తుఫాను కారణంగా పంట పొలాల్లో నీరు చేరి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇప్పటికే సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులకు పంట నష్టం మరింత ఆర్థిక భారాన్ని మిగుల్చుతుందని తెలిపారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు వెంటనే పర్యటించి పరిస్థితిని పరిశీలించాలని కోరారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా పారదర్శకంగా అంచనాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నష్టపరిహారం ప్రక్రియను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. పంట నష్టం అంచనాల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

## వరద ప్రాంతాల్లో వైస్సార్సీపీ నాయకుల పర్యటన

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 25 (వార్త):** మండలంలోని వరద ప్రభావిత గ్రామాలు, పునరావాస కేంద్రాలను వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త శ్యామ్ ప్రసాద్ రెడ్డి పరిశీలించారు. రైతులు, ప్రజలు, అధికారులతో మాట్లాడి వరదల వల్ల ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు.అధికారుల లెక్కల ప్రకారం 398 హెక్టార్ల పంటలు నీట మునిగినట్లు అధికారులు తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో నష్టం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ప్రతి గ్రామంలో సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవ పంట నష్టాన్ని నమోదు చేయాలని ఆయన కోరారు.డొంకూరు, ఇచ్ఛాపురం బాలికల హైస్కూల్ పునరావాస కేంద్రాలను సందర్శించి ఆహారం, తాగునీరు, వైద్యం వంటి సదుపాయాలపై ఆరా తీశారు. అరకభద్ర వద్ద బహుదా నది వంతెన అప్రోచ్ రోడ్డు, ఇన్నేశపేటలో నీట మునిగిన పంటలను పరిశీలించారు. టి.భరంపురం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్యపై అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు.ఈ పర్యటనలో ఎమ్మెల్సి నర్తు రామారావు, బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర , ఆశి కృష్ణ రెడ్డి, ఆశి పురుషోత్తం, బోర పుష్ప, ఉప్పాడ నారాయణమ్మ, దక్కత నూకయ్య, కారింగి త్రినాద్, బింగి నీలాద్రి, రంగాల జానికిరామ్, దువ్వు వివేకానంద, నీలాపు సారధి, బాకీ లక్ష్మి నారాయణ, ఇసురు యాదవుడు, ఇసురు పరశురామ్, దుక్క ధనలక్ష్మి, బుడ్డా బుషి, దున్న గురుమూర్తి ,రైతులు పాల్గొన్నారు.



## వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ పర్యటన



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 25 (వార్త):** ఇచ్ఛాపురం మండలం ఈనెసుపేట గ్రామంలో వరద ముంపు ప్రాంతాలను ఎమ్మెల్సీ నర్తు రామారావు పర్యటించి, వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించారు.ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను, పంట నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నష్టపోయిన అర్హులైన రైతులకు నష్టపరిహారం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ రామారావు హామీ ఇచ్చారు.

## పొగడవెల్లి గెడ్డకు గండి.. 200 ఎకరాల్లో పంట నీట మునక

**- గెడ్డకు గండి పడటంతో నీట మునిగిన వరి పొలాలు - మహేంద్ర తనయ నది వరదతో కొట్టుకుపోయిన గట్టు - శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని రైతుల విజ్ఞప్తి**



**సారవకోట, సెప్టెంబరు 25 (వార్త):** నౌతల సమీపంలో పొగడవెల్లి గెడ్డకు గండి పడటంతో సుమారు 200 ఎకరాల వరి పంట పొలాలు నీట మునిగాయి. మహేంద్ర తనయ నదికి వరద నీరు చేరడంతో పొగడవెల్లి గెడ్డపై ఒత్తిడి పెరిగి గట్టు తెగిపోయినట్లు స్థానికులు తెలిపారు. గెడ్డకు గండి పడటంతో భారీగా నీరు పంట పొలాల్లోకి చేరింది. దీంతో కోతకు సిద్ధమవుతున్న వరి పంట నీట మునగడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట పొలాల్లో నీరు ఎక్కువగా నిలిచిపోవడంతో పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో ఇదే తరహాలో గెడ్డకు గండ్లు పడుతున్నాయని రైతులు పేర్కొన్నారు. తాత్కాలికంగా గండి పూడ్చే చర్యలతో సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించడం లేదని తెలిపారు. వరద నీటి ఉధృతిని తట్టుకునేలా గెడ్డకు పటిష్ఠమైన రక్షణ గట్టు నిర్మించాలని కోరారు. పంటలు దెబ్బతిని నష్టపోతున్న రైతులను అధికారులు పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి తగిన సహాయం అందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా పొగడవెల్లి గెడ్డకు శాశ్వత రక్షణ చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## కోవిలాం జంక్షన్లో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



**ఎల్ఎన్‌పేట, సెప్టెంబర్25(వార్త):** బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలు వలన పలు వీధులు రోడ్లు పొలాలు ముంపునకు గురయ్యాయి. కొన్ని గ్రామాల నుంచి జాతీయ రహదారికి రావాలంటే నీటిలో దిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది కొన్నిచోట్ల వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి... ముఖ్యంగా చెప్పాలంటే జాతీయ రహదారి అలికాం బత్తిలి రోడ్డు, ఎల్ ఎన్ పేట జంక్షన్, కోవిలాం గ్రామం వద్ద రెండో రోజు కూడా ఉధృతంగా నీరు ప్రవహిస్తోంది.. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడవాల్సి వస్తుందని వాపోతున్నారు... ఈ వరద నీరు ప్రవహించడం వలన వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు కల్గి ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత ప్రజాప్రతినిధులు అధికారులు కలుగజేసుకొని, గ్రామంలోకి నీరు రాకుండా తగు చర్యలు తీసుకుంటారని కోరుతున్నారు

## భారీ వర్షాలతో నీటమునిగిన వరి

**- గుప్పిడిపేటలో 500 ఎకరాలకు పైగా వరి సాగుపై వర్ష ప్రభావం**

**- మూడు రోజులుగా పొలాల్లోనే నిలిచిన వర్షపు నీరు**

**- పంట నష్టంపై ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు**



**పోలాకి, సెప్టెంబరు 25 (వార్త):** గుప్పిడిపేట మత్స్యకార గ్రామ పరిధిలో భారీ వర్షాల కారణంగా వరి పంట నీటమునిగింది. గ్రామ పరిధిలో 500 ఎకరాలకు పైగా వరి సాగు చేస్తున్న రైతులు పంట పొలాలు నీటిలో చిక్కుకోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పొలాల్లోకి పెద్దఎత్తున నీరు చేరింది. నీరు బయటకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో వరి పొలాలు వరుసగా మూడో రోజు కూడా నీటిలోనే ఉన్నాయని రైతులు తెలిపారు. పంట కోతకు వచ్చే దశలో నీరు నిలిచిపోవడంతో దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు నీటిని పొలాల నుంచి బయటకు పంపేందుకు అవసరమైన కాలువలు, డ్రైనేజీ మార్గాలు సరిగా లేకపోవడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని రైతులు పేర్కొన్నారు. నీరు ఎక్కువ కాలం నిలిచిపోతే వరి పంట దెబ్బతినడంతో పాటు పెట్టుబడులు కూడా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు గ్రామ పరిధిలోని ముంపు ప్రాంతాలను పరిశీలించి, పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## భారీ వర్షాలు కురిసినా.. రాజుల చెరువుకు నీరేది?

**- పిల్లకాలువల ఆక్రమణలే కారణమంటున్న స్థానికులు**



**నరసన్నపేట, సెప్టెంబరు 25 (వార్త):** తుఫాన్ ప్రభావంతో మండలంలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నా నరసన్నపేట నడిబొడ్డున ఉన్న రాజుల చెరువు మాత్రం వెలవెలబోతోంది. చుట్టుపక్కల గ్రామాల్లోని చెరువులు వర్షపు నీటితో నిండుతుండగా.. పట్టణంలోని ప్రధాన చెరువుగా పేరున్న రాజుల చెరువులో మాత్రం ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. భారీ వర్షాల కారణంగా పట్టణంలోని పలు రహదారులపై వరదనీరు ప్రవహిస్తున్న పరిస్థితి నెలకొంది. అయితే ఇంతటి వర్షపాతం నమోదవుతున్న సమయంలోనూ రాజుల చెరువులో జలకళ కనిపించకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోకి వర్షపు నీరు చేరేందుకు గతంలో ఏర్పాటు చేసిన పిల్లకాలువలు ప్రస్తుతం ఆక్రమణలకు గురైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పిల్లకాలువలు సక్రమంగా ఉంటే పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు చెరువులోకి చేరే అవకాశం ఉండేదని ప్రజలు పేర్కొంటున్నారు. కాలువల పరిస్థితిపై పలుమార్లు సంబంధిత అధికారులకు వినతులు అందించినప్పటికీ సమస్యను పట్టించుకోకపోవడంతోనే ప్రస్తుతం ఈ పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపిస్తున్నారు. భవిష్యత్తులో భారీ వర్షాలు, వరదల సమయంలో నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తకుండా రాజుల చెరువుకు అనుసంధానంగా ఉన్న పిల్లకాలువలను గుర్తించి, వాటిపై ఉన్న ఆక్రమణలను తొలగించి పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు వర్షపు నీరు సహజంగా చేరే మార్గాలను అధికారులు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# తుఫాన్‌తో మత్స్యకారులకు ఇబ్బందులు

**- 10 రోజులుగా వేటకు దూరమైన మత్స్యకారులు**

**- మరో 10 రోజులు ఇదే పరిస్థితి ఉండొచ్చని ఆందోళన**

**- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి**



**పోలాకి, సెప్టెంబరు 25 (వార్త):** తుఫాన్ ప్రభావంతో సముద్రంలో వేటకు వెళ్లలేక గత 10 రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మత్స్యకారుడు నందుపల్లి దండాసి తెలిపారు. పోలాకి మండలం గుప్పిడిపేటలో శుక్రవారం మత్స్యకారులతో కలిసి ఆయన మాట్లాడారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో సముద్రంలోకి వెళ్లి చేపల వేట సాగించే అవకాశం లేకుండా పోయిందని దండాసి పేర్కొన్నారు. మరో పది రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని, దీంతో వేటపై ఆధారపడి జీవించే పేద మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వేట నిషేధ సమయంలో ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించి ఆదుకుందని గుర్తుచేశారు. ప్రస్తుతం తుఫాన్ కారణంగా వేటకు దూరమైన మత్స్యకారుల పరిస్థితిని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని అదే విధంగా ఆర్థిక సాయం అందించాలని కోరారు. మత్స్యకార కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించి, ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

# ముంపునకు గురైన పంట పొలాల పరిశీలన

**- బొడ్డవానిపేట వద్ద అధికారుల పర్యటన**

**- పంట నష్టం వివరాలను వ్యవసాయ శాఖకు తెలియజేస్తామని వెల్లడి**

**- రైతుల సమస్యలపై రెవెన్యూ అధికారుల దృష్టి**

**నరసన్నపేట, సెప్టెంబరు 25 (వార్త):** ఉర్లాం పంచాయతీ పరిధిలోని బొడ్డవానిపేట వద్ద వంతెన సమీపంలో ముంపునకు గురైన పంట పొలాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు ముంపు ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. తండ్యాలవానిపేట, బాలసీమ గ్రామాలకు చెందిన రైతులు సాగు చేసిన పంట పొలాలు నీట మునగడంతో ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వర్షాలు, నీటి ప్రవాహం కారణంగా పొలాల్లో నీరు చేరి పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించి అక్కడి పరిస్థితులను నమోదు చేసుకున్నారు. పంటలపై ముంపు ప్రభావం, సంభవించిన నష్టానికి సంబంధించిన వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేస్తామని వారు తెలిపారు. రైతులకు సంబంధించిన సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టేలా చూస్తామని అధికారులు పేర్కొన్నారు.



## గురుకులాల్లో సమస్యల్లేకుండా చూడాలి

**మందస, సెప్టెంబరు 25(వార్త):** గురుకులాల్లో సమస్యలు లేకుండా చూడాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ వై.యశోదలక్ష్మి అన్నారు. భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ యశోదలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. వర్షంలో ఎవరూ తడవకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తుపాను ప్రభావం ఉందని, గురుకులాన్ని చక్కగా నడిపించాలని సూచించారు. ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని, శతశాతం విజయాలు సాధించే కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రొవిజన్స్ గది, వంటగది డార్మెట్రిలను పరిశీలించారు. విద్యార్థులు చదువుపై పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి సంతృప్తిని వ్యక్త పరిచారు. పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు 100 శాతం పాస్ మార్కులతో పాటు అధికమార్కులు సాధించాలని పలు సూచనలు చేశారు. తుఫాను ప్రభావంతో ప్రహరీ గోడ కొంతమేరకు పడిపోవడాన్ని చూసి జాగ్రత్తలు చెప్పారు. భారీ వర్షాలతో గురుకులం వెనుక వైపున ఉన్న సుమారు 40 మీటర్ల కాంపౌండ్ వాల్ కూలిపోగా, ఏఈ పరిశీలించి అంచనా వేశారు. తుఫాను ప్రభావంతో వర్షాలు అధికంగా పడుతుండటం వలన విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ రమణయ్య, ఇన్ చార్జి ప్రిన్సిపల్ పి.గణపతిరావు, వైస్ ప్రిన్సిపల్ బి.బేబీకుమారి, సిబ్బంది జి.విజయలక్ష్మి, వై.త్రివేణి, ఎ.నీరజ, జి.రూపావతి, వరలక్ష్మి, పద్మావతి, చరిత, శ్రీదేవి, నాగావళి, రజని, స్వర్ణకుమారి, భారతిసాయి, సునీత, హెల్త్ సూపర్ వైజర్ మమ్మీదేవి, పీఈటీ జానకి పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546